క్లుప్తంగా

పర్యావరణ హితంగా వినాయక చవితి



ఏకో ఫ్రెండ్లీ గణేష్ పోస్టర్ విడుదల చేసిన ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: వినాయక చవితిని పర్యావరణ హితంగా భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సూచించారు. స్పేస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఎస్పీ కార్యాలయంలో ఏకో ఫ్రెండ్లీ గణేష్ పోస్టర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో స్పేస్ అధ్యక్షుడు గోపిశెట్టి మురళి కృష్ణారావు, సభ్యులు రామాయణం సతీష్, జడ్డు ప్రసాద్, వీరవల్లి మధు, జడ్డు సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

యనమదుర్రు ప్రవాహ ఉధృతి పరిశీలన

భీమవరం: పట్టణంలోని యనమదుర్రు డ్రెయిన్ ప్రవాహ ఉధృతిని తహసీల్దార్ ఆర్ రాంబాబు, టుటౌన్ సీఐ జి.కాళీచరణ్, ఇరిగేషన్ అధికారులు శనివారం పరిశీలించారు. అల్పపీడనం కారణంగా కురుస్తోన్న వర్షాలకు ఈ డ్రెయిన్ ఉధృతి పెరిగే అవకాశం ఉండడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ప్రస్తుతం డ్రెయిన్ ప్రవాహం ప్రమాదకరస్థాయిలో లేదని తహసీల్దార్ రాంబాబు తెలిపారు.

ప్రజల మన్ననలు పొందడం అభినందనీయం

భీమవరం: ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి ప్రజల మన్ననలను పొందడం అభినందనీయమని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. జిల్లాలో పోలీసు విభాగంలో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన అధికారులను శనివారం ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ఎస్సై వెంకటేశ్వరరావు (సీసీఎస్ భీమవరం), ఎస్సై శ్రీరామచంద్రమూర్తి (పీపీఆర్ భీమవరం), ఏఎస్సై జి.జాన్ విక్టర్ (పాలకొల్లు టౌన్), ఏఎస్సై సీడీ గోవింద బాబు (తణుకు టౌన్)లను ఎస్పీ సాలువ కప్పి సన్మానించారు. జ్ఞాపికలు అందజేశారు. వారి సేవలను కొనియాడి, వారి భావి జీవితం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం సత్యనారాయణ, జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకట్రావు, సైబర్ సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్ ఆర్ ఎస్కె బాజీలాల్, రామ్ కుమార్, మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులు, చట్టాలను తెలుసుకోవాలి

ఉండి: ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను తప్పక తెలుసుకోవాలని ఆర్ఐ కార్తీక్ అన్నారు. శనివారం మండలంలోని అర్తమూరు పెదపేట చర్చ్‌లో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇన్‌ఛార్జ్ వీఆర్వో ఎస్ చిన్నారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆర్ఐ మాట్లాడుతూ మన దేశంలో రాజ్యాంగం ప్రతి పౌరుడికీ హక్కులను కల్పించారని అన్నారు. ఒకరి హక్కులకు మరొకరు భంగం కలిగిస్తే అది చట్టరీత్యా నేరం అవుతుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక హక్కులను ప్రజలంతా తెలుసుకోవాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపైనా తప్పక అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సివిల్స్ రైట్స్ డే రోజున ప్రజలు తెలిపిన సమస్యలపైనా అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొనబోయిన వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజలకు మంచి సేవలు అందిస్తే గుర్తింపు లభిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డి.మహేశ్వరరావు అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వశిష్ట కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో వివిధ హోదాల్లో పనిచేసిన పారా మెడికల్ అధికారి గంటా ప్రతాప్ కుమార్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్‌గా పని చేసిన కేవీ శ్రీనివాసరావు పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతాప్ కుమార్, శ్రీనివాసరావుల దంపతులను మహేశ్వరరావు జిల్లా సహాయ వైద్య శాఖ అధికారి భానునాయక్, అధికారులతో కలిసి పుష్పగుచ్ఛాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ధనలక్ష్మి, గణాంక అధికారి ప్రసాద్, ఆఫీస్ సూపరింటెండెంట్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్జీవో సంఘం పి.శ్రీనివాస్, డిప్యూటీ పారామెడికల్ అధికారులు, జిల్లా వైద్యా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బియ్యం, పంచదార పంపిణీ

భీమవరం: నేటి నుంచి 17వ తేదీ వరకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ చేస్తామని జిల్లా పౌరసరఫరాల ఎస్ సరోజ తెలిపారు. జిల్లాలో 5,67,651 మంది బియ్యం కార్డుదారులున్నారని పేర్కొన్నారు. కార్డుదారులకు బియ్యం ఉచితంగా, ఒక్కో కార్డుకు పంచదార అరకిలో రూ.17కు పంపిణీ చేస్తారని తెలిపారు. అంత్యోదయ కార్డుదారులకు కిలో రూ.13.50 చొప్పున పంపిణీ చేస్తారని వివరించారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

- రెండు రోజులుగా వీడని వాన
- భీమవరంలో 105.6 వర్షపాతం నమోదు
- నీట మునిగిన రహదారులు, వీధులు
- ప్రజా జీవనానికి అంతరాయం

భీమవరం (ప్రకాశం చౌక్): శుక్రవారం ఉదయం నుంచి శనివారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి భీమవరం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. రోడ్లపై రెండు నుంచి మూడు అడుగుల మేర నీరు ప్రవహించింది. వాహనచోదకులు, పాదచారులు నీటిలోనే రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధాన డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జనజీవనం స్తంభించింది. భీమవరంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు భారీగా 105.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. భారీ వర్షంతో పట్టణంలోని ఫుట్‌పాత్, రోడ్లు మార్జిన్‌లో పండ్లు, కూరగాయలు, ఇతర వ్యాపారాలు కొనుగోళ్లుదారులు రాక ఉపాధి దెబ్బంది.

ఎడతెరిపి లేకుండా భారీ వర్షం

ఆకివీడు: భారీ వర్షం జన జీవనానికి తీవ్ర ఆటంకం కల్గించింది. ఎడతెరిపి లేకుండా శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకూ కురిసిన భారీ వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాలు, మెట్ట ప్రాంతాలు నీట మునిగాయి. స్థానిక నగర పంచాయతీలోని సంతపేట, సాలిపేట, పెద హరిజనపేట, జవహర్ పేట, మాదివాడ, అమృతరావు కాలనీ, శ్మశాన వాటిక ప్రాంతాలు జలమయమయ్యాయి. సాలిపేట, మాదివాడ, పెద హరిజనపేటల్లో ఇళ్లల్లోకి నీరు చొచ్చుకుపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వ్యాపారులు దుకాణాలు తెరవలేదు. వ్యాపార సంస్థలన్నీ మూత పడ్డాయి. పాఠశాలలకు సెలవులివ్వడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. మండలంలోని గుమ్ములూరు, చినకాపవరం, కాళింగగూడెం, కోళ్ల పర్రు, కుప్పనపూడి, చెరుకుమిల్లి, అయిభీమవరం, దుంపగడపలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



భీమవరం (ప్రకాశం చౌక్): నీట మునిగిన సెంటిమేరీస్ స్కూల్ గ్రౌండ్



భీమవరం (ప్రకాశం చౌక్): నీటిలోనే రాకపోకలు

భారీ వర్షంతో ఇక్కట్లు



కాళ్ల: రాష్ట్రీయ రహదారిపై వర్షపు నీరు



కాళ్ల: కాలువను తలపిస్తున్న కాళ్లలోని పల్లపు వీధి

కాళ్ల: అల్పపీడన ప్రభావంతో శుక్రవారం తెల్లవారుజాము నుంచి కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. మండలంలోని పల్లపు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. కాళ్లలో సినిమా హాల్ సెంటర్ శివాలయం వద్ద రాష్ట్రీయ రహదారిపై నీరు ప్రవహించింది. రాకపోకలకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆకివీడు: జెడ్పీ స్కూల్ నుంచి అర కిలోమీటరు మేర హైవే ఇలా..



ఆకివీడు: స్థానిక సాలిపేటలో రహదారిపై వర్షపు నీరు



ఆకివీడు: సంతపేటలో ఇళ్లలోకి చొచ్చుకెళ్లిన వర్షపు నీరు

వర్షంతో స్తంభించిన జనజీవనం



కొత్తపూసలమర్రులో మెయిన్‌రోడ్డుపై వర్షపు నీరు

భీమవరం అర్బన్: అల్పపీడనం కారణంగా శనివారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. పల్లపు గ్రామాలైన దెయ్యాలతిప్ప, నాగిడిపాలెం, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, లోసరి తదితర గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. మండలంలో ఒక్కరోజులో 100 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. రాకపోకలకు ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంట చేలలో మోకాళ్లలోతు వర్షపు నీరు చేరింది. ఆక్వా చెరువుల్లో గట్లుకు సమాంతరంగా వర్షపు నీరు చేరింది.



గూట్లపాడులో రోడ్డుపై వర్షపు నీరు

పేదల ఇళ్ల తొలగింపును ఆపండి

ఆకివీడు: స్థానిక అయిభీమవరం రోడ్డులోని పంట బోదెకు ఆనుకుని నివసిస్తున్న సుమారు 80కి పైగా కుటుంబాల ఇళ్లను తొలగించే ప్రయత్నాలు నిలుపుదల చేయాలని సీపీఎం పట్టణ కమిటీ విజ్ఞప్తి చేసింది. శనివారం ఆయా నివాస ప్రాంతాల్ని సీపీఎం నాయకులు సందర్శించి స్థానికుల ఇబ్బందుల్ని తెలుసుకున్నారు. అనంతరం పట్టణ కార్యదర్శి కె.తవిటి నాయుడు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా అయిభీమవరం రోడ్డులో నివసిస్తున్న పేదలకు నిలువనీడ కరువవుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల దుశ్చర్యలకు వారు బలవుతున్నారన్నారు. ప్రత్యామ్నాయం చూపకుండా, యుద్ధప్రాతిపదికన తొలగించేందుకు హుకుం జారీ చేయడం సబబు కాదన్నారు. బాధితులను గుర్తించి తక్షణం రెండు సెంట్ల స్థలం, రూ. 4 లక్షలు ఇళ్ల నిర్మాణానికి మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీవీ వర్మ, బి.రాంబాబు, సందక సూరిబాబు, ఎస్కే వలీ పాల్గొన్నారు.



అయిభీమవరం రోడ్డులోని పంట బోదె ఆక్రమణ దారులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

విద్యుత్ ఉత్పత్తి, పంపిణీలో పవర్ సిస్టమ్స్ పాత్ర కీలకం

భీమవరం: విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, వినియోగాన్ని నిర్వహించడంలో పవర్ సిస్టమ్స్ ముఖ్య పాత్ర పోషిస్తాయని ఉండి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈఎస్ ప్రదీప్‌కుమార్ అన్నారు. భీమవరం డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన రీసెంట్ ట్రెండ్స్ ఇన్ పవర్ సిస్టమ్స్ అండ్ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ అనే అంశంపై ఆయన అతిథి ఉపన్యాసం చేశారు. సబ్‌స్టేషన్స్‌లో ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ అనేవి ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను నిల్వ చేయడానికి ఉపయోగిస్తారని, ఇది ప్రధానంగా విద్యుత్ సరఫరా, డిమాండ్ మధ్య సమతుల్యాన్ని సాధించడానికి ఉపయోగపడతాయని వివరించారు. పెరుగుతోన్న విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఎంతో సులువుగా రీసెంట్ ట్రెండ్స్ ఇన్ పవర్ సిస్టమ్స్ అండ్ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ పరికరాలు డిజైన్ చేయడానికి కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానం అవసరమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ప్రిన్సిపాల్ ఎం అంజన్‌కుమార్, ఈఈఈ డిపార్ట్‌మెంట్ హెడ్ కేబీవీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



భీమవరం డీఎన్నార్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

నైతికతతోనే నిజమైన స్వేచ్ఛ

భీమవరం: జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే నినాదంతో జాతీయస్థాయి అవగాహన ఉద్యమం చేపడుతున్నట్టు ఉద్యమ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఫర్జాన తెలిపారు. శనివారం జమాతే ఇస్లామీ హింద్ భీమవరం శాఖ కార్యాలయంలో ఉద్యమ పోస్టర్ విడుదల సందర్భంగా ఆమె మాట్లాడారు. జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం జాతీయ స్థాయిలో నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే నినాదంతో సెప్టెంబర్ నెలలో అవగాహన ఉద్యమాన్ని నిర్వహిస్తుందన్నారు. సమాజంలో మితిమీరిన స్వేచ్ఛ పేరుతో చోటుచేసుకుంటున్న అనార్థాల వల్ల మహిళలపై చెడు ప్రభావం చూపుతోందని, నిజమైన స్వేచ్ఛ నైతికతతోనే సాధ్యమనే యదార్థాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలనే సదుద్దేశంతో ఈ ఉద్యమాన్ని చేపడుతున్నట్టు చెప్పారు. దేశంలో 1975 నుంచి సమాజ సంస్కరణ కోసం కృషి చేస్తోన్న తమ సంస్థకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆబీద, రిజ్వానా, మారియా, ఫౌజియా, సైదా, అఖ్తరి, శంషాద్, తస్వీర్, సోయబ, తబస్సుమ్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు బోదెలను ప్రక్షాళన చేయాలి

ఆకివీడు: దుక్కి వర్షానికే పట్టణంలోని రోడ్లు, డ్రెయిన్లు ముంపునకు గురవుతున్నాయని నగర పంచాయతీ సర్వ సభ్య సమావేశంలో పలువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం సర్వ సభ్య సమావేశం జరిగింది. సమావేశానికి చైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షత వహించారు. సమావేశంలో కౌన్సిలర్ బత్తుల శ్యామల మాట్లాడుతూ పలు వార్డుల్లోని డ్రెయిన్లలో పూడికలు తీయకపోవడంతో వర్షాలకు వీధులు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. అందేవారి బోదె గుండా మురుగునీరు బయటకు వెళ్లేందుకు అడ్డంకిగా ఆక్రమణలు న్నాయని వైస్‌చైర్మన్ పుప్పాల పండు చెప్పారు.కౌన్సిలర్ నిమ్మల నాగు మాట్లాడుతూ పట్టణంలోని మంచినీటి చెరువులకు అవుట్‌లెట్, ఇన్‌లెట్లలో ఆక్రమణల్ని తొలగించి చెరువుల ప్రక్షాళన చేయాలన్నారు. కౌన్సిలర్ కటికతల జాన్ వెస్లీ మాట్లాడుతూ పట్టణ శివారు ప్రాంతమైన ధర్మాపుర అగ్రహారంలోని మంచినీటి చెరువు పూర్తి ఆక్రమణలకు గురైందన్నారు. 50 ఏళ్ల క్రితం ఆరున్నర ఎకరాల విస్తీర్ణంలో ఉండే ఈ మంచినీటి చెరువును ప్రస్తుతం ఎకరం విస్తీర్ణానికే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులోకి వచ్చే పంట కాలువ నీరు సరిహద్దు రొయ్యల చెరువులతో కలుషితమవుతోందన్నారు. ఈ నీటినే ధర్మాపురంలోని దళిత ప్రజలు తాగాల్సి వస్తోందన్నారు. పట్టణంలో పలు వార్డుల్లో మురుగు డ్రెయిన్లు శుభ్రం చేయించక దుక్కి వర్షానికే రోడ్లు జలమయమైపోతున్నాయని కౌన్సిలర్ బత్తుల శ్యామల అన్నారు. వీధిలైట్ల సమస్యపై కౌన్సిలర్ కిమిడి అరుణకుమారి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై కమిషనర్ జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నామన్నారు. వర్షానికి కొట్టుకొచ్చిన చెత్తవల్ల డ్రెయిన్లలో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారిందని తెలిపారు. సమావేశంలో వైస్‌చైర్మన్ వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు కట్టా రవి, తిరుమారెడ్డి మాధవి, మోటుపల్లి కుమారి, దొడ్డి జగదీష్, గేదల అప్పారావు, జిల్లా పెద్దిరాజు, ఎండీ. అష్రఫ్‌ఉన్నీసా, గోపిశెట్టి సత్యవతి, బొల్లా వీర శ్వేత, నేరెళ్ల ప్రసన్న, గుర్రాన నాగలక్ష్మి, మోపిదేవి సత్యవతి, కోఆప్షన్ సభ్యులు మన్నే లలితాదేవి, గుండుగొల్లు సావిత్రి, ఎండీ.జక్కీ పాల్గొన్నారు.



స్థానిక నగర పంచాయతీ సర్వ సభ్య సమావేశం

వర్షాలతో అధ్వానంగా మారిన రహదారులు

ఉండి: ఉండిలో వర్షాలకు ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా జాతీయ రహదారిపై ప్రయాణమంటే హడలిపోతున్నారు.ఉండిలో ఆర్వోబీ నిర్మాణం ప్రారంభించి కొన్నేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు అతీగతీ లేకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతం. రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఆర్వోబీ వద్ద రైల్వే గేటుకు అటు, ఇటువైపు కూడా రోడ్డు తీవ్రంగా దెబ్బతినడంతో ప్రయాణికుల పరిస్థితి ప్రమాదకరంగా మారింది. కొద్దిరోజుల క్రితం తూతూ మంత్రంగా గోతుల్లో గ్రావెల్ వేసి చేతులు దులుపుకున్నారు. మళ్లీ వర్షం కురవడంతో పరిస్థితి యథాస్థానానికి చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి జాతీయ రహదారితో పాటుగా లింక్ రోడ్ల పరిస్థితి కూడా దారుణంగా మారింది. గ్రామాల్లోని అంతర్గత రోడ్లు డ్రెయినేజీ సమస్యలతో ముంపుబారిన పడ్డాయి. వర్షాలు కురిసిన ప్రతిసారీ ఇదే పరిస్థితి నెలకొనడంతో ప్రజలు తీవ్రంగా అసహనం వ్యక్తం చేస్తున్నారు. శాశ్వత ప్రాతిపదికన పనులు చేస్తే ప్రజాధనం వృధా కాకుండా ఉంటుందని వారంటున్నారు.



ఆర్వోబీ వద్ద వర్షానికి అత్యంత దారుణంగా మారిన జాతీయ రహదారి



డయల్ యువర్ డీఎంకు వినతులు

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. భీమవరం పరిధిలో ఉన్న ప్రజా సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. వేంద్ర మీదుగా రాజమండ్రి రెండో బస్సు సర్వీసు నడపాలని వేంద్ర నుంచి బాలాజీ కోరగా పరిశీలిస్తామని డీఎం సమాదానమిచ్చారు. సాయంత్రం స్కూల్ వదిలే సమయాల్లో రాజమండ్రి బస్సులు వీరవాసరం పెర్కిపాలెం వంతెన రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటుచేయాలని వీరవాసరానికి చెందిన వి.భాస్కరరావు కోరగా చర్యలు తీసుకుంటామని డీఎం తెలిపారు. భీమవరం నుండి బొప్పనపల్లి మీదుగా నరసాపురం బస్ నడపాలి వీరవాసరానికి చెందిన వి.మీరయ్య కోరగా రూట్ పరిశీలన చేస్తామని డీఎం సమాదానమిచ్చారు. భీమవరం నుంచి బొబ్బనపల్లి, మత్స్యపూరి మీదుగా నరసాపురం బస్సు సర్వీసు నడపాలని ఎం నాగరాజు, ఎం వరప్రసాద్, జి.సాయి చంద్, టి.దొర బాబు తదితర ప్రయాణికులు కోరారు. గతంలో ఈ రూటులో బస్సులు నడపగా సరైన ఆదాయం రాక పోవడంతో తీసివేశామని, ఈ రూటులో పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామని డీఎం హామీ ఇచ్చారు.

పింఛన్ లబ్ధిదారులకు తప్పని కష్టాలు

ఆకివీడు: పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఒక రోజు ముందుగా శనివారం ప్రారంభించినప్పటికీ లబ్ధిదారులకు కష్టాలు తప్పలేదు. పలు చోట్ల పింఛన్ పంపిణీ చేసే ఉద్యోగులు ప్రజల ఇళ్లకు వెళ్లకుండా ఒక ప్రాంతంలో ఉండి అక్కడికి లబ్ధిదారులను రప్పించుకుంటున్నారు. వర్షం వల్ల కొన్ని ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లకుండా పింఛన్ పంపిణీ కొన్ని ప్రాంతాలకే పరిమితం చేశారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని పలు చోట్ల ఆయా వార్డుల్లో అక్కడక్కడా కేంద్రాలను ఏర్పాటు చేసుకుని పింఛన్లు పంపిణీ చేశారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఆయా ప్రాంతాలకు వెళ్లి పింఛన్లు తీసుకోవలసి వచ్చిందని వాపోతున్నారు. మండలం, నగర పంచాయతీ పరిధిలో 90 శాతం పింఛన్లు పంపిణీ చేశారు.

పూర్తిస్థాయిలో పింఛన్ల పంపిణీ

వీరవాసరం: మండలాలకు కేటాయించిన లక్ష్యం ప్రకారం పింఛన్లు పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన వీరవాసరం సచివాలయం-1 -2 పరిధిలో సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పలువురికి పింఛన్లు పంపిణీ చేశారు. వీరవాసరం సచివాలయం-2 పరిధిలోని పైడికొండల సత్యవతి, పైడికొండల వీరవేణ అభయ హస్తం పింఛను, పైడికొండల విజయలక్ష్మి క్యాన్సర్ వ్యాధి గ్రస్తురాలు మెడికల్ పెన్షన్ మంజూరు చేయాలని కోరగా ప్రభుత్వ నిబంధనలు మేరకు చర్యలు తీసుకుంటానని జేసీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.విజయ సారథి, పింఛన్లు పంపిణీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఆకివీడు పెదపేటలోని హాస్టల్ వద్ద పింఛన్లు ఇస్తున్న దృశ్యం

పింఛన్‌దారులకు అందని సమాచారం

పాలకోడేరు: సమాచార లోపంతో లబ్ధిదారులు పింఛన్ కోసం పలు చోట్లకు తిరిగారు. మోగల్లులో పాత, కొత్త పంచాయతీ కార్యాలయాల వద్ద ఎవరూ లేకపోవడంతో పింఛన్‌దారులు అసహనం వ్యక్తం చేశారు. దీనిపై పాలకోడేరు ఎంపీడీవో నూకల మురళీ గంగాధరరావును ప్రశ్నించగా లబ్ధిదా ఇళ్ల వద్దనే పింఛన్ పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. సోమవారం కూడా పింఛన్ పంపిణీ చేస్తామన్నారు. పింఛన్‌దారులకు సమాచార లోపంతో ఇలాంటి పరిస్థితి ఎదురైందని, బాధ్యులను గుర్తించి వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

94 శాతం పింఛన్ల పంపిణీ

ఉండి: పింఛన్ల పంపిణీ కార్యక్రమం 94 శాతం పూర్తి చేశామని ఎంపీడీవో రవీంద్ర శనివారం తెలిపారు. మిగిలిన ఆరు శాతం పింఛన్లను ప్రభుత్వాదేశాల మేరకు సోమవారం పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామని ఆయన అన్నారు.